క్లుప్తంగా

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా



ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు

జగిత్యాల: నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం వారు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు .ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు దాదాపు 4 వేల మందిని జీవో 500 ప్రకారం చేర్చకపోవడం వల్ల పనికి తగిన వేతనాలు పొందక ఆర్థికంగా నష్టపోతున్నామన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

దేవుడు ధైర్యాన్ని ప్రసాదించాలి

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సతీమణి రూపాదేవి అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకోవడం పట్ల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సతీమణి మరణం వారి కుటుంబానికి తీరని లోటని, దేవుడు ఆ కుటుంబానికి ధైర్యాన్ని ప్రసాదించాలని కోరారు.

కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ పాలకవర్గం



కలెక్టర్‌కు అభినందనలు తెలుపుతున్న మున్సిపల్ పాలకవర్గం

జగిత్యాల: జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సత్యప్రసాద్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి ఆధ్వర్యంలో పాలకవర్గం కలెక్టర్‌ను కలిసి అభినందనలు తెలిపారు.

ఎరువుల దుకాణాల్లో ఏడీఏ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ రాంచందర్

వెల్గటూర్ : మండలం లోని పలు ఎరువులు, పురుగుమందులు, విత్తనాల దుకాణాలను ధర్మపురి ఏడీఏ రాంచందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధర్మపురి డివిజన్ పరిధి లోని వెల్గటూర్, ఎండపల్లి, చెగ్యాం గ్రామాల్లోని విత్తనాలు, పురుగుమందులు, ఎరువుల దుకాణాల లోని రికార్డులు తనిఖీ చేశారు. ప్రతీ రైతుకు ఈ పాస్ ద్వారానే ఎరువులు ఇవ్వాలని, స్టాక్ రిజిస్టర్‌లు ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు ఫిర్దోస్, మౌనిక, అజయ్ పాల్గొన్నారు.


మురుగు కాల్వ కబ్జాపై కౌన్సిలర్ల ఆందోళన



ధర్నా చేస్తున్న కౌన్సిలర్లు

మెట్‌పల్లి: పట్టణంలోని ప్రధాన మురికి కాల్వను ఓ నాయకుడు కబ్జా చేశారని, దీనిపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట పలువురు కౌన్సిలర్లు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కబ్జా చేసి ప్రహరీ నిర్మించడం వల్ల వర్షాకాలంలో దిగువన ఉన్న వీధుల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అధికారులు వెంటనే దానిని తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చెట్లపల్లి మీనా, పిప్పెర లలిత, జుంగోని మానస, యామ రాజయ్య, మర్రి పోచయ్య, కోఆప్షన్ సభ్యులు మార్గం గంగాధర్, మాధవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోటేశ్వరస్వామిని దర్శించుకున్న కొప్పుల



పూజలు చేస్తున్న కొప్పుల

వెల్గటూర్ : మండలం లోని ప్రముఖ పుణ్యక్షేత్రం కోటిలింగాల కోటేశ్వర స్వామిని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ శుక్రవారం రోజు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఎంపీపీ కూనమల్ల లక్ష్మి, మండల బీఆర్ఎస్ అధ్యక్షు చల్లూరి రాంచంద్రం, నాయకులు, పాల్గొన్నారు.



జగిత్యాలలో యోగాసనాలు వేస్తున్న బీజేపీ నాయకులు



కోరుట్లలో వాకర్స్...



మెట్‌పల్లిలో చిన్నారుల యోగాసనాలు



దొంతాపూర్‌లో విద్యార్థుల యోగా సనాలు



కోరుట్లలో స్కూల్ విద్యార్థుల ఆసనాలు



యోగా చేస్తున్న వెల్గటూర్ గ్రామస్తులు



పెగడపల్లి కస్తూర్బాలో విద్యార్థినుల యోగాసనాలు



కొడిమ్యాలలో...



యోగా విన్యాసాలు చేస్తున్న ఇబ్రహీంపట్నం కేజీబీవీ విద్యార్థినులు

ఘనంగా యోగా దినోత్సవం

జగిత్యాల/జగిత్యాల జోన్/ జగిత్యాల టౌన్/ కోరుట్ల /కోరుట్ల టౌన్ /కోరుట్ల రూరల్ /మెట్‌పల్లి ధర్మపురి/ రాయికల్ /కొండగట్టు/ పెగడపల్లి/ఇబ్రహీంపట్నం/మల్యాల/కథలాపూర్/వెల్గటూర్ : అంతర్జాతీయ యోగా దినోత్సవంను శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. జిల్లా కేంద్రం, కోరుట్ల, ధర్మపురి, రాయికల్, మెట్‌పల్లి పట్టణాలు, అన్ని మండల కేంద్రాలు, గ్రామాలు, పాఠశాలల్లో యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యానం, యోగాసనాలు, శ్వాస వ్యాయామాలు, సూర్య నమస్కారాలు చేశారు. యోగా దినోత్సవం ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమాల్లో యోగా అభ్యాసకులు, ప్రజలు పాల్గొన్నారు.



జగిత్యాల జిల్లా కేంద్రంలో యోగా చేస్తున్న విద్యార్థులు

భూమి సాగు అడ్డుకుంటున్నారని వినతి



జువ్వాడికి విన్నవిస్తున్న వేములకుర్తి మహిళలు

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తి గ్రామ శివారులో భూమిని సాగు చేసుకోకుండా అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారని మండలంలోని వేములకుర్తి గ్రామ ఎస్సీ మహిళలు శుక్రవారం మెట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జువ్వాడి నర్సింగరావుకు వినతి పత్రం అందించారు. విన్నవించారు. గ్రామశివారులోని సర్వేనంబర్ 264/2లో 20 ఏళ్ల క్రితం ప్రభుత్వం 37 మంది ఎస్సీ మహిళలకు ఒకొక్కరికి 8 గుంటల చొప్పున 9 ఎకరాల భూమిని కేటాయించారని, పట్టాదార్ పాసుపుస్తకాలు కూడా ఇచ్చారని, ప్రతీ ఏడాది రైతు బందు కూడ తీసుకుంటున్నామని, 2 ఏళ్ల నుంచి అటవీశాఖ అధికారులు తమను సాగు చేసుకోకుండా అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. వెంటనే జువ్వాడి నర్సింగరావు స్పందించి డీఎఫ్‌వో వెంకటేశ్వర్‌రావుతో ఫోన్‌లో మాట్లాడి వివరించగా, అటవీ భూమి చుట్టూ కాంటూరు కందకం తవ్వామని, కందకం దాటి సాగు చేసుకోవద్దని , కందకం అవతల సాగు చేసుకుంటే మాకు అభ్యంతరం లేదని, సాగు చేసుకోవచ్చని తెలిపారని మహిళలు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు పెంట లింబాద్రి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సరిహద్దు చూపించాలని ఆర్‌డీవోకు వినతి



ఆర్‌డీవోకు వినతిపత్రం ఇస్తున్న గోధూర్ గ్రామస్తులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని గోధూర్ గ్రామానికి చెందిన గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు గ్రామ సరిహద్దును చూపించాలని కోరుతూ శుక్రవారం మెట్‌పల్లిలో ఆర్‌డీవో శ్రీనివాస్‌కు, ఇబ్రహీంపట్నంలో తహసీల్దార్ ప్రసాద్‌కు విన్నవించారు. గ్రామ శివారులో ఉన్న నర్సింహస్వామి ఆలయం చిన్నదిగా ఉండటం వలన, దాతల సహకారం, దేవదాయశాఖ నిధులు రూ. 50 లక్షలతో నూతన ఆలయాన్ని నిర్మించేందుకు నిర్మాణ పనులు చేపట్టగా, మల్లాపూర్ మండలం ముత్యంపేట గ్రామస్తులు, ముదిరాజులు తమ స్థలం అంటూ నిర్మాణ పనులను అడ్డుకుంటున్నారని, వెంటనే మా గ్రామ సరిహద్దును సర్వే చేయించి, చూపిస్తే ఆలయం నిర్మిస్తామని, లేకుంటే నిధులు వాపస్ వెళ్లిపోతాయని విన్నవించారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు ఓంకారి లక్ష్మణ్, ఉపాధ్యాయులు సురకంటి వెంకట్‌రెడ్డి, వీడీసీ సభ్యులు, నాయకులు జగన్ రావు, పాల్గొన్నారు.

పంచాయతీలో నిధుల దుర్వినియోగం



కలెక్టర్‌ను కలిసిన సంస్థ ప్రతినిధులు

మేడిపల్లి: మండలంలోని కొండాపూర్ గ్రామ పంచాయతీలో రూ.80 లక్షలకు పైగా పంచాయతీ నిధులు దుర్వినియోగం అయినట్లు కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ (పౌర మానవ హక్కుల సంస్థ) ప్రతినిధులు తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలో ఆర్టిఐ యాక్ట్ 2005 చట్టం ప్రకారం మార్చిలో గ్రామ పంచాయతీ రికార్డులు తనిఖీ చేశామని, గ్రామపంచాయతీలో నిధులు అవకతవకలు జరిగినట్లుగా గుర్తించామని, తాము అడిగిన రికార్డులు చాలా వరకు అందుబాటులో లేవన్నారు. పూర్తి నివేదికను ఆధారాలతో కలెక్టర్‌కి, జిల్లా పంచాయతీ శాఖ అధికారికి అందించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ సెక్రటరీ మల్లేశ్, రీజినల్ కో ఆర్డినేటర్ సత్యనారాయణ, జక్కుల మల్లేశ్, జవ్వాజి నరేశ్, గంగాధర్, చిరంజీవి, శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణ మహోత్సవంలో భక్తులు

మల్లాపూర్: మండలంలోని వెంకట్రావ్‌పేటలో శుక్రవారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీవెంకటేశ్వర స్వామి కల్యాణంను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎంపీటీసీ తోట సుజాత-శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సర్పంచ్ జోగుల మమత -రాజేశం దంపతులు, వీడీసీ సభ్యులు స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సాముహిక కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

మేడిపల్లి: భీమారం మండల కేంద్రంలో వేంకటేశ్వర స్వామివారి కల్యాణమహోత్సవం కన్నుల పండువగా జరిగింది. కల్యాణానికి గ్రామస్తులతో పాటు, చుట్టుపక్కల గ్రామస్తులు కల్యాణంలో పాల్గొన్నారు. మూడురోజుల జాతరలో భాగంగా గురువారం పుట్టమన్ను తెచ్చే కార్యక్రమం, శుక్రవారం కల్యాణ మహోత్సవం, శనివారం నాగెల్లితో వేడుకలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని కలిసిన బీసీ నాయకులు



బండి సంజయ్‌ని సత్కరిస్తున్న బీసీ నాయకులు

జగిత్యాల: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన బండి సంజయ్‌ని బీసీ సంక్షేమ నాయకులు శుక్రవారం సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీ సంక్షేమానికి కృషి చేయాలని వారు కోరారు. ఎళ్లవేళలా అందుబాటులో ఉంటానని మంత్రి పేర్కొన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ, నాయకులు అలిశెట్టి ఈశ్వరయ్య, రాంచందర్, రాపర్తి రవి, మల్లయ్య, నాగేందర్, రుషికేశ్ పాల్గొన్నారు.

ఎన్‌పీడీసీఎల్ సీఎండీకి సన్మానం



సీఎండీని సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

కోరుట్ల: ఎన్‌పీడీసీఎల్ చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి మెట్‌పల్లి విద్యుత్ డివిజన్ కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మెట్‌పల్లి డివిజన్ 327 యూనియన్ నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ కే. వేణుగోపాల్ రెడ్డి, సెక్రటరీ హరిప్రసాద్, స్టేట్ కౌన్సిల్ సభ్యుడు నూనె లక్ష్మణ్, నాయకులు ఉత్తం నాయక్, అనంతం, అశోక్, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

ధర్మపురి: దైవదర్శనం కోసం వచ్చిన ఓ భక్తురాలి సెల్‌ఫోన్ పోవడంతో దేవస్థానం సిబ్బంది వెతికి అప్పగించారు. హైదరాబాద్‌కు చెందిన గంజికుంట్ల లక్ష్మి అనే భక్తురాలు శుక్రవారం లక్ష్మీనృసింహుడి దర్శనానికి ధర్మపురికి వచ్చారు. దేవస్థానం ఆవరణలో రూ.20 వేల విలువ గల సెల్‌ఫోన్ పోగొట్టుకోగా అది దేవస్థానం సిబ్బందికి దొరకగా వెంటనే సెల్‌ఫోన్‌ను ఈవో శ్రీనివాస్‌కు అందజేశారు. సిబ్బందిని అభినందించారు.

ప్రొఫెసర్ జయశంకర్ సార్‌కు నివాళి

మెట్‌పల్లి: దివంగత ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి వేడుకలను శుక్రవారం పట్టణంలోని స్వర్ణకార సంఘ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో అధ్యక్షులు నాంపల్లి సింహాద్రి,ఇల్లెందుల కృష్ణమాచారి, శ్రీధర్, దురిశెట్టి నటరాజ్, గిరిధర్, సంజీవ్ తదితరులున్నారు.

జయ శంకర్ సార్ వర్ధంతి అధికారికంగా జరపాలి

కోరుట్ల: ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా ఉపాధ్యక్షుడు బెజ్జారపు భూమాచారి అన్నారు. శుక్రవారం ప్రొఫెస్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఆసుపత్రిలో రోగులు, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు.

ధర్మపురి: ఆచార్య కొత్తపల్లి జయశంకర్ వర్ధంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఆరెపెల్లి ప్రభుత్వ పాఠశాలలో ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుజాత

మెట్‌పల్లి: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని చైర్‌పర్సన్ రాణవేని సుజాత సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం చైర్‌పర్సన్ అధ్యక్షతన పాలకవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే పలువురు కౌన్సిలర్లు వార్డుల్లో నెలకొన్న సమస్యలను చైర్‌పర్సన్ దృష్టికి తీసుకరాగా, వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో 38 అంశాలను ప్రవేశపెట్టగా, వాటికి కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. సమావేశంలో కమిషనర్ మోహన్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

పెగడపల్లి: పరిసరాల పరిశుభ్రతను పాటించి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీవో మహేందర్ సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో పంచాయతీ, వైద్య సిబ్బంది కలిసి శుక్రవారం డ్రైడే నిర్వహించారు. పెగడపల్లిలో ఎంపీవో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో వారు ఇంటింటా పర్యటించి నీటి తొట్టీలు, టైర్లలో ఉన్న నీటి నిల్వలను పారబోయించారు. ఏఎన్ఎంలు ఆశవర్కర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

జగిత్యాల: అంతర్జాతీయ సాఫ్ట్ బేస్‌బాల్ పోటీల్లో జగిత్యాలలోని శ్రీచైతన్య సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులు జె.సుమిత్, హర్షవర్ధన్, హరికృష్ణ ప్రతిభ కనబర్చారు. ఇండియా తరుపున ఆడి బంగారు పతకాలు సాధించా రు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ గంగారెడ్డి, డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు.

బాల్య వివాహాల నిర్మూలనకు సహకరించాలి



చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్

జగిత్యాలరూరల్: బాల్య వివాహాలను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జగిత్యాల చైల్డ్ హెల్ప్‌లైన్ కౌన్సిలర్ మానస అన్నారు. శుక్రవారం జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 0–18 ఏళ్ల లోపు బాలబాలికల కోసం ఈ సంస్థ పనిచేస్తుందన్నారు. బాల్యవివాహాలు, లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్న పిల్లలు, మత్తు పదార్థాలకు అలవాటు పడిన పిల్లలు, బాలకార్మికులు, స్కూల్‌డ్రాప్ పిల్లలు ఎక్కడ పనిచేస్తున్నా చైల్డ్ హెల్ప్‌లైన్‌కు తెలపాలన్నారు. 18 ఏళ్లు అమ్మాయికి, 21 ఏళ్లు అబ్బాయికి వచ్చాకే వివాహం చేయాలన్నారు. లేదంటే భవిష్యత్‌లో శారీరక ఇబ్బందులు ఎదుర్కొంటారని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మధుసూదన్, హెచ్‌ఎం బన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో దోపిడీ అరికట్టాలి



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మెట్‌పల్లి: విద్యా సామగ్రి పేరుతో అడ్డుగోలు దోపిడీకి పాల్పడుతున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం బీజేపీ నాయకులు ఆర్డీవో శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అధికంగా ఫీజులు వసూలు చేయడమే కాకుండా నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్, ఇతర సామగ్రిని అధిక ధరలకు అమ్ముతూ తల్లిదండ్రులను ఆర్థికంగా దోచుకుంటున్నారని ఈ సందర్భంగా ఆయనకు వివరించారు. వీటిని అరికట్టాలని విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. పాఠశాలల్లో తనిఖీలు చేపట్టి నిబంధనలను ఉల్లంఘిస్తున్న వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు బొడ్ల రమేశ్, దొనికెల నవీన్, సుంకేట విజయ్, కలికోట శ్రీకాంత్, నూనె క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మల్లాపూర్: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని శ్రీ వాసవీ కన్యక పరమేశ్వరి ఆలయ ఆవరణలో ఈ నెల 25న నిర్వహించే కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కనుక సంజీవ్ అన్నారు. శుక్రవారం మల్లాపూర్‌లో రుద్ర రాంప్రసాద్‌తో కలిసి మాట్లాడారు. రేకుర్తి కంటి ఆస్పత్రి సహకారంతో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇసుక డంపులు స్వాధీనం

కోరుట్ల రూరల్: మండలంలోని నాగులపేటలో అక్రమంగా నిలువ చేసిన ఇసుక డంపులను రెవెన్యూ, మైనింగ్ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న 150 ట్రిప్పుల ఇసుక డంపులకు త్వరలో వేలం పాట నిర్వహిస్తామని రెవెన్యూ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మైనింగ్ అధికారి తిరుపతి రావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వై. రాజేందర్ రావు, రెవెన్యూ, మైనింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ మహారాజ్ బోగ్ బండర్

రాయికల్: మండలంలోని మంక్త్యానాయక్‌తండాలో గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ బోగ్ బండర్ పూజ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాడి పంటలు పశువులు బాగుండాలని, ఎలాంటి అనారోగ్య సమస్యలు రావద్దని సేవాలాల్ మహారాజ్‌ని వేడుకున్నారు. కార్యక్రమంలో మాలోత్ హరిదాస్ నాయక్, తాజా మాజీ ఉపసర్పంచ్ మాలోత్ గంగాధర్‌నాయక్, మోహన్‌నాయక్, గిరిజన శక్తి మండల అధ్యక్షులు నరేందర్‌నాయక్, పాల్గొన్నారు.

పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్య ప్రాధాన్యం

జగిత్యాల: పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్య ఎంతో ప్రాధాన్యమని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అంగన్‌వాడీ టీచర్లకు జాతీయ నూతన విద్య మూల్యాంకన పుస్తకాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు మంచి నైపుణ్యంతో కూడిన విద్య బోధనతో పిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్దాలన్నారు. సమావేశంలో జిల్లా సంక్షేమాధికారి వాణిశ్రీ, ఏవో హన్మంతరావు, సీడీపీవోలు , కో–ఆర్డినేటర్ మదుకుమార్, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.